# బాలింత సంగమ్మ*

ఆంధ్ర శేషగిరిరావుగారు, సారస్వత సమాజము.

విద్యానగర రత్నసింహాసనాధీశ్వరుఁడైన ప్రౌఢదేవరాయల సరదారులలో గోన కాటారెడ్డి ఎన్నికగన్న వాఁడు. కులమునకు ఆతఁడు తెలగ. అతనిది మిడిమెళ్ల గోత్రము. కాటారెడ్డి చేసిన సేవకు మెచ్చి రాయలవారు ముగదత్తి, రాయచూరు అను గ్రామములందు కోటలు నిర్మించుటకు ఆతనికి ఆజ్ఞనిచ్చిరి.

రాజాజ్ఞ తలనిడుకొని కాటారెడ్డి మొదట ముగదత్తిలో కోటకట్టుటకు ప్రారంభము చేసెను. పని చురుకుగా జరిగెను. బురుజులుతీరి కోట అచిరకాలముననే పూర్తియయ్యెను. అనంతరము కాటారెడ్డి రాయచూరు గ్రామమున కోటకట్టుటకు మొదలిడెను.

శుభముహూర్తమున దుర్గనిర్మాణమునకు శంకుస్థాపన జరిగెను. పునాదులు ఏర్పడినవి. గోడలు లేచినవి. కాని బురుజుపని తుదముట్టలేదు. పూర్తి కాకుండగనే అదినేల కూలెను. అంతమాత్రమున కాటారెడ్డి నిరుత్సాహపడలేదు. తిరిగి పని ప్రారంభము చేసెను. కాని ఈ మాఱుకూడ బురుజు నిలబడలేదు. రెడ్డికి అనుమానము తోచెను. అయినను మఱల నాతఁడు బురుజుపని రెట్టింపు కట్టుదిట్టములతో చేయించెను. కాని కార్యము లేక పోయినది.

తిరిగి బురుజు నేలమట్టమయ్యెను. ఇట్లు నాలుగు అయిదు సారులు జరిగెను. అందుతో కాటారెడ్డికి అనంతమగు విచారముకలిగెను. తుదిప్రయత్నముగా ఆతఁడు మఱల బురుజు నిర్మించుటకు దొరకొనెను. అప్పుడచ్చట పనిచేయుచున్నవారిలో నొక కాపువానికి శివమెత్తెను. ఆవేశము కనుపించిన పురుషుఁడు కాటారెడ్డితో నిట్లు పలికెను.

"నే నొక మహాశక్తిని. చిరకాలముగా నే నీ ప్రదేశమును ఆశ్రయించుకొని యున్నాను. బలియిచ్చి నన్ను తృప్తిపఱచిగాని మీ రిచ్చట కోట గట్టలేరు. మీరు నాకు బలి ఈయనికారణమున బురుజును కూలద్రోయుచున్నాను. నాకు సాధారణమైన

* అపూర్వమైన ప్రాణత్యాగ మొనర్చిన రమణీమణి-చరిత్ర.

బలితో సంతృప్తికల్గదు. ఒక బాలింతస్త్రీని ఆమె కనిన బిడ్డతోఁ గూడ నాకు బలినీయవలెను. ఇచ్చెదరా బురుజు నిలుచును. ఈయరా ఎవరీజన్మమున నిచ్చట కోట నిర్మింపఁజాలరు.''

కాటారెడ్డి యిదివినెను. దీర్ఘవిచారపరీతమైన ఆతనిమనము ఆలోచనాక్షీణమయ్యెను. కోట నిలబడుటకని ఏస్త్రీవచ్చి శిశుసహితముగ బలిపోవును? ప్రాణములపై తీపిని చంపుకొనుటకు కొందఱు సాహసింప వచ్చును. కాని కడుపార గన్నబిడ్డను మృత్యుముఖమున చేతులార నర్పించుటకు ఏతల్లిప్రాణ మంగీకరించును? ఇంత ప్రయత్నము చేసి దుర్గనిర్మాణమును పూర్తి చేయక పోయి అతఁడే మొగముతోఁ దిరిగి తన యేలికయగు ప్రౌఢదేవరాయలను దర్శింపఁగలఁడు? ఎన్నివిధముల చింతించినను అతనికి ఆలోచన తెగలేదు.

కోటలోనున్న మహాశక్తి శిశుసహితముగ నొక బాలింతరాలిని బలికోరుచున్న వార్త జలతైలబిందువై రాయచూరుగ్రామమున మూఁడు పూటలలోఁ బురమందుఁ గూడ వ్యాపించెను. తుదకా సంగతి పురిటిమంచముపైనున్న తెలగవారిచిన్నది సంగమ్మ చెవికిఁ గూడఁ జేరెను. ఆమె అప్పటికి మూఁడుదినములకుఁబూర్వము ప్రసవించియున్నది. కోట కట్టుటకు కాటారెడ్డి చేయుచున్న సకలప్రయత్నములును బూడిదలోఁ బోసిన పన్నీరగుచుండుట ఆమె గమనించెను. కోటతీరినచో నదిప్రజలకు మిక్కిలి ఉపకారిగా నుండ గలదని ఆమె నిజ మూరసెను.

"చావు ఎప్పటికైన తప్పనిదే. జరాభారమున క్రుంగి, రోగములచే క్రుంది జీవితమును నిరర్థకముగా తుద ముట్టించుటకంటె ప్రజాభ్యుదయమునకై ఇష్టపడి మరణమును వరించుట ఉత్తమము; కీర్తిదాయకము" అని త్యాగబుద్ధిగల సంగమ్మకుఁ దోచెను. తనప్రక్కలో దూరి పరుండియుండి అప్పుడప్పుడే నేత్రములను విప్పి లోకమును గాంచుచున్న ఆ నెత్తురుకందు నొకసారి యామె తిలకించెను. "ఈ ప్రజోపయోగ కార్యములో నా చిట్టిబిడ్డకూడఁ బాల్గొనుగాక! పసుముద్దకు దేవతాపీఠమున స్థానము లభించుగాక!" అని ఆమె నిష్కర్ష చేసికొనెను.

పొత్తులలో పొదువుకొని ఆమె కోట చెంతకుఁ బోయెను. నిశ్చలబుద్ధితో నామె శిశుసహితముగ పునాదిగోతిలో దుమికెను. కూలివాండ్రు చురుకుగా పైన యిటుకలు పేర్చి గోడలు కట్టిరి. గోడలు లేచెను. బురుజు తీరి చెక్కుచెదరక నిలిచెను. క్రమముగా మిగిలిన బురుజుల నిర్మాణముకూడఁ బూర్తియయ్యెను; దుర్గము సర్వాంగశోభతో విలసిల్లెను.

సంగమ్మ చేసిన అపూర్వత్యాగము దేనికి సూపసిద్ధికల్పించినదో ఆరాయచూరు దుర్గమునుండి ప్రభుత్వము సాగించి కాటారెడ్డి కాటభూనరేంద్రుఁడని ప్రసిద్ధిచెందెను. తన అభ్యుదయమునకు సంగమ్మ త్యాగము మూలదుంప యన్నసంగతి రెడ్డిప్రాణము లున్నంతవఱకు విస్మరింపలేదు.

మహాత్యాగిని సంగమ్మ శిశుసహితముగా బలిపోయి నిలిపిన బురుజు యిప్పటికిని ఆమెపేరిట 'బాలింత సంగమ్మ కోట' అనివ్యవహరింపఁబడుచున్నది. త్యాగధనుల పవిత్ర నామములు అక్షరమను సూత్రము నీవిషయము ప్రతిపాదించుచున్నది.

సంగమ్మ త్యాగము అతిలోకమైనది. పరోపకారార్థము ప్రాణత్యాగ మొనర్చిన రమణీమణులు ఇతిహాసప్రపంచమున పలువురుగలరు. కాని శిశుసహితముగ బలిపోయినవారు మిక్కిలి తక్కువ. తల్లికి తన ప్రాణముమీఁద కంటె తన బిడ్డ ప్రాణముమీఁద మమకారము హెచ్చు. అట్లుండుట ప్రకృతి సిద్ధము. లోకసహజమైన అట్టి మమకారమును గూడ తెగగోసి లోకోపకారార్థము శిశుసహితముగ ప్రాణములను విడిచిన పడఁతి త్యాగబుద్ధిని కొలఁదులు వెట్టఁదరము కానిది. ఆమె సాహసము శతథా శ్లాఘింపవలసినది.

ఈ కథ శ్రీ మెకంజిదొరవారు సేకరించిన లోకలు రికార్డులలోని 'కైఫీతాతు గద్యాలు' నుండి గ్రహింపఁబడినది.